


డ్రైవర్ కుమార్తెకు సాయం అందజేస్తున్న స్కూల్ యాజమాన్యం, నర్సింహ(ఫైల్)

బ్రెయిన్‌డెడ్‌తో మృతి.. ముగ్గురికి అవయవదానం

బాలానగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా బ్రెయిన్‌డెడ్ అయిన ప్రైవేట్ స్కూల్ డ్రైవర్ అవయవదానం చేసి ఇద్దరికి ప్రాణదానం చేశాడు. వివరాల్లోకి వెళితే బాలానగర్ రాజుకాలనీలో నివాసముండే ఆదిముల నర్సింగ్(45) ఫిరోజ్‌గూడ ఎన్ఎస్‌కేకే ప్రైవేటు స్కూల్‌లో పదేళ్ల నుంచి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. అనారోగ్యం, హైబీపీ కారణంగా బ్రెయిన్‌డెడ్ కావడంతో కుటుంబసభ్యులు అతడిని సనత్‌నగర్ ఈ ఎస్ఐ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఈనెల 6వ తేదీన మృతి చెందాడు. దీంతో వైద్యుల సలహా మేరకు డ్రైవర్ కుటుంబసభ్యులు అతడి అవయవాలను దానం చేశారు. ఒక కిడ్నీని ఈఎస్ఐలో చికిత్స పొందుతున్న మహిళలకు, మరో కిడ్నీ, లివర్‌ను ఉస్మానియా ఆసుపత్రికి అందజేశారు. నర్సింగ్ కుటుంబానికి ఆదుకునేందుకు స్కూలు యాజమాన్యం ముందుకొచ్చింది. గురువారం స్వాంత్రత్య దినోత్సవ వేడుకల్లో డ్రైవర్ కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేసింది.



గణేష్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

దుండిగల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయనకు కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, కిషోర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీని వాస్, మల్లేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ రాయితీని సద్వినియోగం చేసుకోండి

ఫతేనగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా టీజీఎస్ ఆర్టీసీ అందజేస్తున్న రాయితీని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్ఎం కవిత రూపులా ఒక ప్రకటనలో తెలిపారు. శుభకార్యాలు, పెళ్లిల్లు, వేడుకలకు వెళ్లాలనుకునే వారికి ఆర్టీసీ బస్సులు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆమె చెప్పారు. రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా మహిళలందరికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకుని సురక్షితంగా ప్రయాణించి ఇండ్లకు చేరుకోవాలని ఆమె సూచించారు.

సెల్లార్ తవ్వుతుండగా కూలిన ప్రహరీ



సెల్లార్ తవ్వుతుండగా కూలిన ప్రహరీ

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కమర్షియల్ భవనం కోసం ధర్మారెడ్డి ఫేజ్-2లో ఎంఐజీ 96 ప్లాట్‌లో జేసీబీతో సెల్లార్ తవ్వుతుండగా పక్కనే ఉన్న ఇంటి ప్రహరీ శుక్రవారం కూలిపోయింది. 300 గజాల్లో పట్టపగలు సెల్లార్ తవ్వుతున్నా మూసాపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. కాలనీలో ప్రహరీ కూలిన విషయం, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు కాలనీవాసులు సిద్ధమవుతున్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగునీరు



గాంధీ అపార్ట్‌మెంటులో నిలిచిన మురుగునీరు

గచ్చిబౌలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్ల హుడా ట్రేడ్‌సెంటర్‌లోని గాంధీ అపార్ట్‌మెంట్స్ పరిసర ప్రాంతాల్లో రోడ్డుపై రోజుల తరబడి వర్షపునీరు, మురుగునీటితో కలిసి ఉంటోంది. ఈ ప్రంతంలో మూడునెలలుగా మురుగునీటి సమస్య ఉందని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతమంతా వర్షపునీరు నిల్వవుండటంతో డ్రైనేజీ నీటితో కలిసి రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తు అనారోగ్యాల పాలువుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డిని వివరణగా కోరగా సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అసంపూర్తి పనులపై జడ్సీతో ఎమ్మెల్యే సమావేశం



జడ్సీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

గచ్చిబౌలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులు, నిధులు మంజూరై పనులు ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జోనల్‌కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఆయన జడ్సీని కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని, కొన్ని మధ్యలో నిలిచిపోయాయని, చాలా ప్రాంతాల్లో తాగునీటి కోసం పైపులైన్లు వేయాలని ఎమ్మెల్యే గాంధీ జడ్సీని కోరారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.



అధికారులతో కలిసి అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

హైదర్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ రాంనరేష్‌లో చేపడుతున్న సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులు వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహదేవ్, దేవి, సూపర్‌వైజర్ ఓంప్రకాశ్, స్థానికులు శ్రీనివాస్, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, చంద్రయ్య, అర్జున్‌రెడ్డి, రాంచందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గచ్చిబౌలి సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తుననట్లు గచ్చిబౌలి ఏఈ వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ జర్నలిస్ట్‌కాలనీ ఫీడర్ పరిధిలోని జర్నలిస్ట్‌కాలనీలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, 11 కేవీ గౌలిదొడ్డి ఫీడర్ పరిధిలోని గౌలిదొడ్డి, కేశవనగర్, పద్మశ్రీ గార్డెన్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు, 11 కేవీ పద్మశ్రీ గార్డెన్స్ ఫీడర్‌పరిధిలో పద్మశ్రీగార్డెన్స్, గౌలిదొడ్డి ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెల తెలిపారు.

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ విద్యుత్ సెక్షన్ పరిధిలో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ విద్యాసాగర్ శుక్రవారం తెలిపారు. నాలుగోఫేజ్, జేఎన్‌టీయూ, డీమార్ట్, ధనలక్ష్మీ, ఐదోఫేజ్, ఇందూ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుననట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

● కిటకిటలాడిన ఆలయాలు ● పెరిగిన పూలు, పండ్ల ధరలు

శేరిలింగంపల్లి జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)

శ్రావణమాసంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే వరలక్ష్మీ పూజలు, నోములు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లోని పలు కాలనీలు, బస్తీల్లోని ఆలయాలు ఉదయం నుంచే కిటకిటలాడాయి. దేవాలయాలకు మహిళలు విచ్చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి తామర పువ్వులతో విశేష పుష్పార్చన, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయకమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



పూజా సామాగ్రి కొనుగోలు కోసం మార్కెట్‌లో కిక్కిరిసిన జనం



ఖైల్‌కాలనీలో..



బాలానగర్ ఆలయంలో..



పేట్‌బషీరాబాద్‌లో కరెన్సీతో అలంకరణ



ఆలయంలో కుంకుమార్చనల్లో భక్తులు

పెరిగిన పువ్వులు, పండ్ల ధరలు

శ్రావణ శుక్రవారం కావడంతో మార్కెట్లు జనంతో పోటెత్తారు. వరలక్ష్మి వ్రతం పూజా సామాగ్రి, పూలు, పండ్లు ధరలను వ్యాపారులు అమాంతంగా పెంచేశారు. నిన్న మొన్నటి వరకు డజను అరటి పళ్లు 50 రూపాయలు ఉంటే, ప్రస్తుతం డజన్ 80 రూపాయలకు విక్రయించారు. 15, 20 రూపాయలు ఉన్న మూర పువ్వులు 80 రూపాయలు. ప్రత్యేక రోజుల్లో ధరలు పెరగకుండా నియంత్రించాలని వినియోగదారులు కోరుతున్నారు.



జవహర్‌నగర్‌లో జరిగిన పూజల్లో మహిళా భక్తులు



అమ్మవారికి అర్చన చేయించుకుంటున్న భక్తులు



హైదర్‌నగర్: ఆల్విన్‌కాలనీ ఫేజ్-2 ఆలయంలో పూజలు



పూల దుకాణం



భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి నివాసంలో వరలక్ష్మి వ్రతం పూజలు

24 గంటల్లో భారీ భవనాలను కూల్చేసిన హైడ్రా

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణదారుల్లో గుబులు



నేలమట్టమైన భవనం

నిజాంపేట్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని ఎర్రకుంట చెరువులో భారీ బహుళ అంతస్తుల భవనాన్ని శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు హైడ్రా అధికారులు సిబ్బందితో కలిసి పూర్తిగా నేలమట్టం చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో వెలిసిన మూడు భారీ భవనాలను 24 గంటల సమయంలో నేలమట్టం చేయడంతో అక్రమ నిర్మాణదారుల గుండెల్లో గుబులు పుట్టింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో సర్వేనెంబరు 134లో రెండు జంబో క్రేన్‌లు, రెండు ఇటాచీలు సహాయంతో గురువారం తెల్లవారుజాము నుంచి కూల్చివేతలు మొదలుపెట్టి, శుక్రవారం ఉదయం వరకు పనులు చేపట్టారు. మూడు అపార్టుమెంట్‌లను నేలమట్టం చేశారు. ఈ ఎర్రకుంట చెరువు మొత్తం 3.10 ఎకరాలు విస్తీర్ణంలో ఉండగా, కొందరు నిర్మాణదారులు 360 గజాల చొప్పున విభజించి, మూడు ప్రాంతాల్లో మొత్తం 12 వందల గజాల్లో 5 ఫ్లోర్ల వరకు నిర్మాణం చేపట్టారు. ఇంతకాలం చెరువు ప్రక్కన ఉన్న ప్రైవేట్ సర్వేనెంబర్లును ఆధారంగా అధికారుల అండదండలతో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు. మొత్తానికి ఈ కూల్చివేతలతో భవన నిర్మాణదారుల్లో భయం మొదలైంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మరికొన్ని అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించడానికి హైడ్రా ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది.

స్పోర్ట్స్, లీడర్‌షిప్ బ్రాండ్ అంబాసిడర్‌గా పీవీ మునిమనవరాలు



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న అదితి సిరి గాయత్రీ మారంరాజు

మాదాపూర్,ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్పోర్ట్స్, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ హాఫ్ ఆన్ కంగారూ బ్రాండ్ అంబాసిడర్‌గా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు మునిమనవరాలు అదితి సిరి గాయత్రీ మారంరాజుని నియమించారు. శుక్రవారం మాదాపూర్ జూబ్లీ రిడ్జ్ హోటల్‌లో జరిగిన కార్యక్రమం లో ఈ ప్రకటన చేశారు. హాఫ్ కంగారూ అనేది భారతీయ విద్యార్థుల కోసం ప్రత్యేకమైన పర్యాటక కార్యక్రమం, దీనిని తెలంగాణకు చెందిన ఎన్ఆర్ఐ, ఆస్ట్రేలియాకు చెందిన వ్యాపారవేత్త హరీష్ బిసామ్ స్థాపించారు. ఇది క్రీడలు, జట్టు నిర్మాణం వ్యక్తిగత అభివృద్ధిని మిళితం చేసే ప్రత్యేక నాయకత్వ కార్యక్రమం అన్నారు. అదితి సిరి గాయత్రి మారంరాజుని అంబాసిడర్‌గా ఉండటం ఆనందంగా ఉందని హాఫ్ ఆన్ కంగారూ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ బిసామ్ తెలిపారు.

కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన

మియాపూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల గురించి హేళనగా మాట్లాడిన మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. కేటీఆర్ అనుచితంగా మాట్లాడటాన్ని నిరసిస్తూ శుక్రవారం మియాపూర్ మైత్రినగర్ కమాన్ వద్ద పార్టీ మహిళ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.

ఇంజనీరింగ్ సీట్లు ఇస్తామని లక్షలు వసూలు

● విద్యార్థి సంఘాల నాయకుల ఆందోళన ● కళాశాల ముందు తీవ్ర ఉద్రిక్తత



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

దుండిగల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీలో సీట్లు ఇస్తామని లక్షలు తీసుకొని అడ్మిషన్లు లేవని తెలుపడంతో విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ ఏరోనాటికల్ కళాశాల వద్ద ఆందోళన శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఎదుట ఆందోళన చేస్తుండడంతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాలేజీ గేట్లను మూసివేయడంతో నెట్టుకుంటూ లోపలికి వెళ్లే ప్రయత్నం చేస్తుండడంతో అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను అదుపు చేశారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకొని గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి.నాగరాజు డిమాండ్ చేశారు. 250 మంది విద్యార్థులు ఒక్కొక్కరి నుంచి రూ.14 లక్షల నుంచి 16 లక్షల వరకు డొనేషన్‌ల పేరుతో రూ.2 వందల కోట్లకు పైగా రశీదు లేకుండా కళాశాల యాజమాన్యం వసూళ్లు చేసిందని ఆరోపించారు. ఈ కళాశాలకు కేవలం 320 మంది అడ్మిషన్ తీసుకోవడానికి అవకాశం ఉండగా ఐదొందలకు పైగా అడ్మిషన్‌లు తీసుకున్నారని, బీ కేటగిరి సీట్లు నోటిఫికేషన్ రాకముందే విద్యార్థుల నుంచి అక్రమ పద్ధతిలో డొనేషన్లు వసూళ్లు చేసి సీట్లు ఇస్తామని విద్యార్థుల తల్లిదండ్రులకు మోసం చేసిందన్నారు. అడ్వాన్సుగా డబ్బులు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకొని కళాశాలను రద్దు చేయాలని ధ్వజమెత్తారు.

వరదనీరు నిలిచే ప్రాంతాల్లో

హోల్టింగ్ స్ట్రక్చర్లు

గచ్చిబౌలి: రహదారులపై వరద నీరు నిల్వకుండా ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధునాతన వాటర్ హోల్టింగ్ స్ట్రక్చర్లు నిర్మిస్తున్నట్లు మున్సిపల్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ పేర్కొన్నారు. వీటి నిర్మాణాలతో రహదారులపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఏర్పడుతున్న అంతరాయానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని రోడ్ నెంబర్ 45, నెక్టార్ గార్డెన్స్, సైబర్ టవర్స్ ప్రాంతాల్లో ఎస్ఎన్‌డీపీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వాటర్ హోల్టింగ్ స్ట్రక్చర్లను జడ్సీ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం దానకిషోర్ మాట్లాడు తూ.. ఈతరహా నిర్మాణాలను దశలవారిగా విస్తరిస్తామన్నారు. జాప్యం లేకుండా పనులు పూర్తిచేయాలని కోరారు.

హైటెక్స్‌లో మూడు పారిశ్రామిక ప్రదర్శనలు

● బ్యాటరీ రీసైక్లింగ్, వ్యర్థాల నిర్వహణ, మెషీన్‌టూల్స్

● మూడు రంగాలకు చెందిన 450 స్టాల్స్ ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణ, బ్యాటరీల రీసైక్లింగ్, మెషిన్‌టూల్స్‌లో సరికొత్త ఆవిష్కరణలను పరిచయం చేస్తూ మాదాపూర్ హైటెక్స్‌లో ఏక కాలంలో మూడు రకాల పారిశ్రామిక ప్రదర్శనలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ ప్రదర్శనలో ఆయా రంగాలకు చెందిన 450 సంస్థలు తమ స్టాళ్లను ప్రదర్శనలో ఉంచినట్లు హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ తెలిపారు. బ్యాటరీ రీ సైక్లింగ్ దేశంలోనే రెండో పెద్ద మార్కెట్‌గా మారుతోందని, బ్యాటరీల పునర్వినియోగం, రీ సైక్లింగ్‌పై ఏకరూప నిబంధనలు లేవని వక్తలు తెలిపారు. చైనా, యూరప్, జపాన్‌లలో ఇలాంటి నియంత్రణలు ఉన్నారని తెలిపారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న సంస్థలకుచెందిన షో డైరెక్టరీని వక్తలు విడుదల చేశారు. ఈ సదస్సులో మాట్లాబ్స్ టెక్నాలజీస్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ వర్గీస్ శామ్యూల్, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్ అసోసియేషన్ డాక్టర్ శైలేంద్ర సరోజ్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ రోబోటిక్ ఆటోమేషన్ ప్రెసిడెంట్, రాజ్‌కుమార్‌శర్మ, చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఫేజ్-3 అధ్యక్షుడు రమేష్ మియ్యాపురం, నేషనల్ సాలిడ్ వేస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ అమియా కుమార్‌సాహు, తెలంగాణ చిన్న (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల సంఘాల సమాఖ్య ఎ.భాస్కర్‌రెడ్డి, జీడిమెట్ల పరిశ్రమల సంఘం అధ్యక్షుడు ఎ.ప్రవీణ్‌రెడ్డితో పాటు పలువురు పారిశ్రామిక వేత్తలు, నిపుణులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పాస్టర్‌పై దాడి

గాజులరామారం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకులు ఓ పాస్టర్‌ను చితకబాదారు. గాజులరామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో దైవాదన చర్చిలో పాస్టర్ ప్రసాద్ సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ చర్చిలో నుంచి బయటకు వచ్చాడు. చర్చి ప్రక్కనే ఉన్న నాల్గుఅంతస్తుల భవనంపై 8 మంది యువకులు గురువారం రాత్రి మద్యం సేవించారు. మందు తాగుతున్న యువకులు ఫోన్ మాట్లాడుతున్న పాస్టర్ వద్దకు వచ్చి తమ వీడియో ఎందుకు తీస్తున్నావంటూ ప్రసాద్‌ను చితక బాదారు. దీంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి చికిత్స నిమిత్తం చేర్పించారు. అయితే చర్చి ప్రక్కనే కొంత స్థలంలో చర్చి నిర్వాహకులు గదిని నిర్మించారు. ఇది ఇష్టంలేని మందు తాగుతున్న యువకులు చర్చి లోపలికి వెళ్లి కిటికీ అద్దాలను, లోపల ఉన్న సామగ్రిని ధ్వంసం చేశారు. గురువారం రాత్రి సూరారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి సీఐ భరత్‌కుమార్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పాస్టర్‌పై దాడి జరిగిన విషయం తెలుసుకున్న గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, కుత్బుల్లాపూర్ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొన్నారు. మరికొందరు పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు.

దొంగపోలీస్ అరెస్ట్

● దొంగనోట్ల చెకింగ్ అంటూ బెదిరించి దారిదోపిడీలు

● కటకటాల్లోకి ఇరాన్ గ్యాంగ్ ముఠా సభ్యుడు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పోలీసుగా చెప్పుకొని బెదిరిస్తూ దారిదోపిడీలకు పాల్పడుతున్న ఓ అంతరరాష్ట్ర దొంగను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇరానీగ్యాంగ్‌కు చెందిన సభ్యుడిగా గుర్తించిన పోలీసులు అతని నుంచి రూ.95వేల నగదు, నకిలీ పోలీస్ ఐడీ కార్డు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుదీంధ్ర తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్, సుల్తాన్ బజార్, అఫ్జల్‌గంజ్, కుల్సుంపురా, లంగర్‌హౌజ్ పోలీస్ స్టేషన్‌ల పరిధుల్లో ఇటీవల వరుసగా దారిదోపిడీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘావేశారు. పోలీసు అధికారిగా చెప్పుకుంటూ ఓ వ్యక్తి రోడ్డుమీద వెళ్తున్న వారిని బెదిరిస్తూ మీరు నకిలీ కరెన్సీ (దొంగనోట్లు) తీసుకెళ్తున్నట్లు సమాచారం వచ్చిందని, అందుకే మఫ్టీలో ఉండి చెక్ చేస్తున్నామని నకిలీ ఐడీతో వారిని బురిడీ కొట్టిస్తూ దారిదోపిడీలకు పాల్పడుతున్నాడని గుర్తించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీలు జల్లెడ పట్టి బేగంబజార్ పరిధిలో అతన్ని పట్టుకున్నారు. అతన్ని విచారించగా కర్ణాటక రాష్ట్రం బీదర్ ఇరానీ గల్లీలో ఉండే.. ఇరానీ ముఠాకు చెందిన జాఫర్ ఆలీ అలియాస్ లంబుగా ఒప్పుకొన్నాడు. ఇతను పలు నగరాల్లో తిరుగుతూ, వ్యాపార ప్రాంతాలు అధికంగా ఉండే ఏరియల్లో రెక్కీ చేస్తాడు. నగదు రవాణా చేసేవారిని గుర్తించి రహస్యంగా ఫాలో అయి, పోలీస్ అంటూ బెదిరిస్తాడు. మీవద్ద నకిలీ కరెన్సీ ఉందని చెక్ చేయాలని నమ్మిస్తాడు. ఈ క్రమంలో వారి దృష్టి మరల్చి నగదు లేదా బంగారం దోచుకొని ఉడాయిస్తాడు. ఇటీవల వరుసగా ఐదు కేసులు నమోదవడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం రంగంలోకి దిగి, బేగంబజార్ పోలీసులతో కలిసి అతన్ని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాగిరెడ్డి



ఫతేనగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకరం చేసిన ప్రొ. కోదండరాంను కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశాడు. అనంతరం కోదండరాంను శాలువాతో సత్కరించారు.

బెల్ట్ షాప్‌లపై దాడి.. 136 మద్యం బాటిళ్ల పట్టివేత

బోరబండ: బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న బోరబండ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 136 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సార్ నగర్ ఏసీపీ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. బంజారా నగర్‌లో కొంత కాలంగా ఓ మహిళ బెల్ట్ షాపు నిర్వహిస్తుంది. పలుమార్లు దాడులు నిర్వహించి ఆమెపై ఇప్పటికే 9 కేసులు నమోదు అయ్యాయన్నారు. పోలీసుల రాకను గమనించిన ఆ మహిళ పరారిలో ఉన్నారని ఆమె కోసం గాలిస్తున్నామని ఆయన తెలిపారు. కాగా, బోరబండలో ఓ ఎస్సై అరాచకమంటూ సోషల్ మీడియాలో వచ్చిన వార్తను ఏసీపీ వెంకటరమణ ఖండించారు. పోలీసులు ప్రజల రక్షణకే ఉన్నారని తెలిపారు.



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ చేస్తున్న మాధవరం కృష్ణారావు

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

హైదర్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న 50 మంది సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మంజూరైన చెక్కులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో బాధిత లబ్ధిదారుల కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 50 మంది లబ్ధిదారులకు 14.94 లక్షల విలువ చేసే చెక్కులను అందజేసినట్లు తెలిపారు.

● కూకట్‌పల్లి దయానగర్‌కు చెందిన నర్సింగరావు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి బిల్లుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో రూ.60 వేలు అందజేశారు.

మౌంట్ ఎల్బ్రస్‌పై మువ్వన్నెల జెండా

యూరప్‌లో అతిపెద్ద పర్వతాన్ని అధిరోహించిన దుండిగల్ యువకుడు



ఎల్బ్రస్ పర్వతంపై తులసిరెడ్డి

దుండిగల్ సిటీ, ఆగస్టు 16ఆంధ్రజ్యోతి): కఠోర సాధనతో ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని నిరూపించాడు నగర శివారులోని బౌరంపేట్ గ్రామానికి చెందిన తులసి రెడ్డి అనే యువకుడు. 78వ స్వాతంత్ర దినోత్సవం రోజున యూరప్ ఖండంలో అతిపెద్దదైన (5,642 అడుగుల ఎత్తైన) మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని తులసిరెడ్డి అధిరోహించి జాతీయ పతాకాన్ని ప్రదర్శించి జై భారత్ అంటూ నినదించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఎవరెస్ట్ పర్వతాన్ని తక్కువ సమయంలో అధిరోహించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2019లో సముద్రమట్టానికి 6,153 మీటర్ల ఎత్తులో ఉన్న స్టాక్ ఖంగ్రీ అనే మంచు పర్వతాన్ని మైనస్ 15 డిగ్రీలలో, 2021లో 4190 అడుగుల ఎత్తున ఉన్న కాశ్మీరీ గ్రేట్ లెగ్స్ శిఖరాన్ని, 2013లో ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని మైనస్ 5 డిగ్రీల ఉష్ణోగ్రతలో అధిరోహించినట్లు తెలిపారు.